



**పూ**ర్వం వైశాలీ నగరంలో ఒక మహాపండితుడుండేవాడు. అతని పేరు శివశర్మ. చిన్నతనంలోనే కాశీనగరం చేరుకొన్నాడతను. యోగ్యులైన గురువుల వద్ద శుశ్రూష చేసి, అనేక కావ్యాలు, శాస్త్రాలు చెప్పుకొన్నాడు. అతనిమంచితనాన్ని, విద్యను, వినయాన్ని చిరకాలంగా గమనిస్తున్న శంభుదాసుడనే మరొకపండితుడు, తనకూతురు సుముఖిని శివశర్మకిచ్చి వివాహంచేశాడు. వివాహమైన కొద్దికాలానికే శంభుదాసుడు పరమపదించాడు.

అంతదాకా శివశర్మకు డబ్బుకు సంబంధించిన విషయాలేవీ తెలీవు. విద్యార్థిగా ఉన్నప్పుడు అధ్యాపకుల ఇళ్ళలోనే భోజనం చేసేవాడు. ఆ దరిమిలా, శంభుదాసుడు అతని బాధ్యతలు తీసుకొన్నాడు. ఇప్పుడేమో కుటుంబ భారమంతా అతని మీదకే విరుచుకు పడింది!

కొన్ని రోజులపాటు, సుముఖి అప్పుసప్పులు చేసి సంసారం గడుపుకొచ్చింది. కానీ ఎంతకాలమని అలా జరుగుతుంది గనక? ఇచ్చే వారయినా మాసాల కొద్దీ అప్పులివ్వలేరు గదా! ఈ దరిద్రానికితోడుగా శివశర్మ బిక్షతండ్రి కూడా అయినాడు. అనుభవం మీద నేర్చుకొనే లక్షణం శివశర్మలో లేదని సుముఖి గ్రహించింది. తను పదేపదే నోరు చేసుకోవటంవల్ల లాభం ఉండదని కూడా ఆమె గ్రహించింది. విష్ణు శర్మకూ, తనభర్తకూ, మంచి స్నేహం ఉంది. పైగా వారిద్దరూ సహాధ్యాయులు కూడా! అందుకని సుముఖి, ఓనాడు విష్ణుశర్మ దగ్గరకు వెళ్ళి తన గోడునంతా వినిపించింది. తను శివశర్మకు నచ్చచెబుతా నన్నాడు విష్ణుశర్మ. అనటమే కాదు — ఆ మరునాడు పని పెట్టుకొని వచ్చి, శివశర్మను రాజదర్శనం చేయమనీ, పాండిత్యాన్ని ప్రదర్శించి, బహుమతులు పొందమనీ, ప్రోత్సాహ పరిచాడు.

ఇష్టం లేకపోయినా, శివశర్మ రాజదర్శనం చేశాడు. చీకటిపడే వేళకు ఇంటికొచ్చాడు. భర్త ఎన్ని కానుకలతో వస్తాడో అనుకొన్న సుముఖి, అతను వట్టి చేతులతో తిరిగిరావడం చూసి కొయ్యబారి పోయింది. శివశర్మ మౌనంగా ఉండిపోయాడు.

ఆ రాత్రి చాలా పొద్దుపోయాక సుముఖి అడిగింది -

"మీరు ప్రభువులను దర్శించారా?" అని

ముందుగా శివశర్మ నిట్టూర్పు విడిచాడు. ఆ వెంటనే అతని ముఖం జేవురించింది. కన్నులు ఎర్రబడ్డాయి.

"వెళ్ళాను. ప్రజలు దేవాలయానికి వెళ్ళారని తెలిసి అక్కడకూ వెళ్ళాను. ఆయన ప్రార్థన విన్న తరువాత, ఎలాంటి నిరుపేదను, యాచించడానికివచ్చానో నాకు అర్థమయింది. సిగ్గుతో కుంగిపోయాను. తనకున్న రాజ్యం చాలదనీ, ఇరుగుపొరుగు రాజ్యాలను కూడా తన రాజ్యంలో కలపమనీ, రాజుగారు ప్రార్థిస్తున్నారు ఆయనా యాచకుడే, నేనూ యాచకుణ్నే అయినప్పుడు వారినడిగి లాభం లేదని వెనుదిరిగి వచ్చేశాను" అన్నాడు శివశర్మ.

ఈసారి సుముఖి నిట్టూర్చింది.

తన భర్త అమాయకత్వానికే నవ్విందో, అతని సచ్ఛీలానికే నవ్విందో తెలీదు మరి !